# పుణ్యానికి పోతే

శరభయ్య బొటనవేలంత లావు లంకపుగాకు చుట్టను గుండ్రంగా చుట్టూ పెదాలమధ్య తిప్పుతూ వేరే ధ్యాసేమీ లేకుండా కాలుస్తూ కూర్చున్నాడు. అదే చెట్టునీడలో అయిదడుగుల దూరంలో చిన్నరాతిబండమీద చతికిలబడ్డ నడికారు కుర్రాడు శరభయ్య లంక పుగాకు చుట్టతో సమానంగా వెలిగించిన సిగరెట్టు చూస్తుండగానే చిన్నదై వేళ్ళను చుర్రుమనిపిస్తే దాన్ని అవతలకు విసిరి, మళ్ళీ కాల్చుకోడానికి సిగరెట్టు లేక దిగాలుపడ్డట్టుగా ముఖం తేలేశాడు. బస్సు పక్కనే దాని నీడలో చతికిలబడ్డ ఆడాళ్ళ మధ్య ఒక ఒడిలో నాలుగేళ్ళ కుర్రాడు శరభయ్యనూ, ఆ వెనక రోడ్డుపక్క పొగవస్తున్న సున్నపుబట్టీ గొట్టాన్నీ విస్తుపోయి చూస్తున్నాడు.

చిన్న ప్రమాణంలో గున్నేనుగులాంటి స్థూలశరీరాన్ని స్థిరనిశ్చలతలో వుంచి చుట్ట కాల్చుకొంటున్న శరభయ్య ఓమారు గట్టిగా దమ్ముపీల్చి వదిలిపెట్టి "ఏం బావా బస్సు యియ్యాల్టికి బయలుదేరేట్టులేదే" అన్నాడు వెనక కూర్చున్న బావమర్ది లక్ష్మయ్యను సంబోధిస్తూ.

లక్ష్మయ్య 'ఊ' అని ఊరుకున్నాడే గాని అంతకుతప్పించి జవాబు యివ్వలేదు.

"ఏం చేస్తున్నావయ్యా?" అంటూ వెనక్కి తిరిగాడు శరభయ్య.

లక్ష్మయ్య అతని పక్కనున్న యిరవైఏళ్ళ కుర్రాడితో మాట్లాడుతున్నాడు. బావమర్ది శరభయ్య 'ఏం చేస్తున్నావయ్యా' అని అంటే లక్ష్మయ్య చిన్న చిరునవ్వు నవ్వి పక్కనున్న

కుర్రాడిని చూపిస్తూ "మన రాఘవయ్య లేడూ... అదే మన ఊర్లో సుందర్రామయ్యతో వియ్యం కట్టాడే రామాపురం రాఘవయ్య, అతని కొడుకట! పట్నంలో బి.ఏ పరీక్ష యిచ్చి వస్తున్నాడట" అన్నాడు.

'మన రాఘవయ్య' అని అనడంలో లక్ష్మయ్య లౌక్యాన్ని అర్థం చేసుకున్న శరభయ్య, రాఘవయ్యను ఎరక్కపోయినా నిండుగా చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు, ఆ తర్వాతి విషయం బావమర్దికే వదిలిపెడుతూ.

బావమర్ది లక్ష్మయ్య యిలాటి విషయాల్లో మంచి ఘటికుడు.నిమిషాల మీద యిట్టే సంబంధం స్థిరపరిచే వ్యవహారవేత్త. ఒకవిధంగా పెళ్ళిళ్ళ పేరయ్య అని అనిపించుకున్నాడు. ఎలాలేదన్నా పదీపదిహేను పెళ్ళిళ్ళు తనచేతిమీదుగా చేయించాడు. అన్నీ యిప్పుడు హాయిగా సంసారాలు సాగుతున్నాయి. ఒక్క శరభయ్య పెద్దకూతురు సీతాలక్ష్మిది తప్ప. దానిరాత అలావుండి ముండమోసి బతుకు బండలైందికాని లేకపోతే దానికేం, రాజాలాంటి బతుకు.

"బస్సు బాగుపడింది రండ"ంటూ కండక్టరు కేకవేసాడు. అంతవరకు ఆ చెట్టుకింద జట్లుజట్లుగా కూర్చుని లోకాభిరామాయణాల్నీ, వ్యాపారలాభాల్నీ తిరగేస్తున్న మగాళ్ళూ, పేర్ల దగ్గరనుండి మెళ్ళో కాసులపేర్లవరకు పరామర్శించుకొంటున్న ఆడాళ్ళూ పిల్లాపీచుల్నీ వెంటబెట్టుకుని బస్సెక్కి ఎవరి సీట్లలో వాళ్ళు కూర్చున్నారు. శరభయ్య తను కూర్చోవడానికి కాస్త అనువుగా వుండేలా ముందే వెళ్ళి యింకా బావమర్ది రాడేమిటి చెప్మా అంటూ ఎదురుచూస్తున్నాడు. అతని చేతిలో చుట్ట ఎంతకీ కాలనంటోంది. ఇక కాల్చడానికి ఓపికలేకో, లేక ఆ వెనక ఆడాళ్ళకు పొగబాధ కలిగించడం యిష్టంలేకో చేతిలో చుట్టను బయటికి గిరాటేసి కాండ్రించి ఓమారు ఉమ్మేసి, స్థలం దొరికింది కదాని సీటుకు జారపడి టాపును చూస్తూ కూర్చున్నాడు.

బస్సు బయలుదేరేముందు హారను వేయగా లక్ష్మయ్యా, ఆ కుర్రాడూ ఆదరాబాదరాగా వచ్చి బస్సెక్కారు. ఆ కుర్రాడు డ్రైవరు పక్కసీట్లో కూర్చున్నాడు. లక్ష్మయ్య వెళ్ళి బావమర్ది పక్కనే చతికిలబడ్డాడు.

లక్ష్మయ్యలో ఉత్సాహం కనిపించలేదు. కూర్చున్నవాడు కూర్చున్నట్టుగా మౌనంగా వుండిపోయాడు.

శరభయ్యకు సంగతేమిటో అర్థంకాలేదు. ప్రశ్నార్థకంగా బావమర్దివైపు చూశాడు.

లక్ష్మయ్య కొద్దిసేపు మౌనంగా కూర్చుని పెదాలు చప్పరించి "అబ్బే లాభంలేదు బావా" అన్నాడు.

'అంటే?' అన్నట్టుగా లక్ష్మయ్యను చూసి "ఏం?" అన్నాడు శరభయ్య.

"ఏదో ... బాగానే డబ్బుందనుకున్నాను కాని అంతా రెండేళ్ళకిందటే హరించిపోయిందట! వెనక సుందర్రామయ్యతో వియ్యం కట్టేప్పుడు కాస్తా కొద్దోగొప్పో చేతిలో వున్నవాడే. పదెకరాల మాగాణీ, మూడెకరాల కొండ్ర, చేతిలో పదీపదిహేనువేల నగదు వుండేవి. ఈ మధ్య మరో యిద్దరు కూతుళ్ళ పెళ్ళిళ్ళు చేశాడట. కొత్తగా పొగాకువేసి ఓ సంవత్సరం దెబ్బతిన్నాడట. ఇక పట్నంలో అబ్బాయి చదువుకు ఏటా రెండువేలన్నా అవుతుంది కదా. మొత్తం చదువు పూర్తయ్యేసరికి ఎనిమిదివేలదాకా ఖర్చవుతుంది. అటు పెళ్ళిళ్ళకూ, యిటు చదువులకూ చేతిలో నగదుపోగా వున్న ఆ పొలంకాస్తా అమ్మేశాడట. ఏదో ఉన్నవాడూ, ఊడబొడిచినవాడూ అనుకున్నాను. ఇంతాచేస్తే యిదీ! ఇలాంటివాడికి పిల్లనిస్తే అడుక్కుతినేందుకు చిప్పచేతికిచ్చినట్టే. పిల్లాడు బుద్ధిమంతుడే. అయితే యేం, ఈరోజుల్లో చేతిలో తడిలేకపోతే బతికేదెట్టయ్యా?" అన్నాడు లక్ష్మయ్య. సాధ్యమైనంత నెమ్మదిగా, ఎదుటివాళ్ళకు వినిపించనంతగా నోట్లో గొణుక్కుని, ఆరిపోయిన చుట్టను వెలిగించుకునేందుకు ఒకటి రెండు నిమిషాలు తంటాలుపడి మళ్ళీ ప్రారంభించాడు–

"చూడు శరభయ్య బావా! మన బుల్లికి మొగుడే దొరక్క పోతాడంటావ్? రేపు వచ్చే ఆదివారం మొన్నటి సంబంధం సంగతేమిటో తేల్చుకొచ్చేస్తాను. అంతా సవ్యంగానే వ్యవహారం వుందిగాని ఎటొచ్చీ ఆ వచ్చిన చిక్కంతా కట్నం దగ్గరే. ఎంత బి.ఏ చదివితే మాత్రం యిరవైవేలా కట్నం! ఇల్లుగుల్లచేసి యిమ్మంటాడో, ఎక్కడ్నించన్నా ఎత్తుకొచ్చి యిమ్మంటాడో అర్థంకాకుండా వుంది. ఈసారి వెళ్ళినప్పుడు అటోయిటో తేల్చుకొచ్చేస్తాను. ఇదికాకపోతే మరొకటి. ఈ చేతులమీదుగా పదిహేను పెళ్ళిళ్ళు జరిపించిన లక్ష్మయ్య మేనకోడలికి పెళ్ళే చేయలేడా?" లక్ష్మయ్య ఓమారు మీసాల్ని దువ్వి నాలుగు దమ్ములు గబగబా పీల్చి బావమర్ది ముఖంలోకి చూశాడు, అంతసేపూ తను వాగినదానికి బావమర్దినుండి జవాబు ఏమొస్తుందో అని.

శరభయ్య అయిదునిమిషాలు తాపీగా కూర్చుని "చూడుబావా" అన్నాడు. 'ఆ, చూస్తూనే వున్నాను. ఏమిటో చెప్పు' మన్నట్టుగా లక్ష్మయ్య మౌనంగా చూశాడు.

"ఇరవైవేలుపోసి ఆ కుర్రాడిని కొనుక్కోకపోతే ఏం పోయె? ఆ డబ్బుపెట్టి

లక్షణంగా ఏ లేనివాడికో కట్టబెడితే ఏమాయె! ఇంతకూ మనకు కావలసినదేమిటి? ఏదో దాని బతుకు అది బతుక్కొంటూ మనల్ని ఆశించకుండా వుండాలనే కదా. లక్షాధికారికిచ్చినా భిక్షాధికారికిచ్చినా అదే ఆశతో పెళ్ళి చేస్తాం. కాకపోతే అంతస్థులకు తగ్గట్టు ఖర్చులవుతాయి. లక్షరూపాయల ఆస్థివున్నవాడి చేతిలో పెడ్తేమాత్రం పిల్ల సుఖిస్తుందని, వాడు దాన్ని పువ్వుల్లోపెట్టి పూజిస్తాడని మనం కలగన్నామా? అలా అని మనం రాసిపుచ్చుకోలేం గదా. దాని అదృష్టం బావుండి మొగుడు మంచివాడయితే, అంత డబ్బున్నందుకు నాలుగు కాసులపేర్లు మెళ్ళో తగిలించుకుంటుంది. ఇందుకేనా మనం అన్నివేలూ పోసి ఆడబ్బున్నవాడికిచ్చుకోవడం? చిలకల్లా నవ్వుతూ వాళ్ళు కనిపించాలేగాని మెళ్ళో ఎంత బరువుంటేమాత్రం ఏముంది? ఏదో, మనం తెలీక డబ్బు పట్టుకుని వేలాడతాంగాని. ఒక విషయం చెప్తా ఆలోచించు. డబ్బుందని ఆశకొద్దీ చేసిన కాపురాలుచూడు. మన రాములు మనవరాలది, రాఘవులు కూతుర్ది, ఆలయం వీధి మిఠాయికొట్టు సూరిసెట్టి చిన్నకూతుర్ది- అన్నీ ఏమయ్యాయి? అందుకే లేనివాడినే చదువుకున్న ఓ మంచివాడిని చూసి చేద్దామని వుంది. నోట్లో ఆ మాత్రం అక్షరంముక్క పెట్టుకుని పెళ్ళాన్నే పోషించుకోలేకపోతా డంటావ్. అటుపుణ్యం, యిటుపురుషార్థం రెండూ కలిసొస్తాయి. లేనివాడిని ఉద్ధరించాడన్న పేరూ దక్కుతుంది, మన బాధ్యతా నెరవేరుతుంది. ఏమంటావ్?'' అంటూ లక్ష్మయ్య ముఖంలోకి చూశాడు శరభయ్య.

లక్ష్మయ్య సందేహంగా నసిగాడు ''కాని మన అంతస్థుకు తగ్గ సంబంధం కాకపోతే అంతా ఏమనుకుంటారు?''

''ఏమనుకుంటారయ్యా, మనపిల్ల భవిష్యత్తు మనం నిర్ణయించాలిగాని వీళ్ళు అనుకోవడం అనుకోకపోవడంతో పనేమిటి? రేపు పొద్దున్న దాని బతుకు ఏమైనా అయితే వీళ్ళు వెళ్ళి ఉద్ధరిస్తారాయేం?''

లక్ష్మయ్య తలాడించాడు.

'బావచెప్పింది బాగానేవుంది. పోనీ లేనివాడినే తెచ్చి చేస్తే కాస్త విశ్వాసమైనా వుంటుంది. మనం చెప్పినట్టుకూడా నడుస్తాడు. కష్టపడి సంపాదించుకొంటాడు గనక డబ్బు విలువ తెలుస్తుంది'- అనుకుంటూ ఆలోచించి, మళ్ళీ ఆరిపోయిన చుట్టను అవతలకు విసిరి, ముందుసీటులో కూర్చున్న కుర్రాడితో అరగంటసేపు కలిసికూర్చుని మాట్లాడినా,యిప్పుడు మళ్ళీ పరిశీలనగా అయిదునిమిషాలు అతడినే చూసి, బావమర్దికి దగ్గరగా జరిగి ''ఇందాకటి అబ్బాయి ఎలా వున్నాడంటావ్‌బావా?'' అని అడిగాడు.

శరభయ్య మెలిపెట్టిన మీసాల సందుల్లోంచి చిన్నగా నవ్వి అన్నాడు. "అబ్బాయికేం,రాజులా వున్నాడు, కాకపోతే పెద్ద డాంబికంగా లేడంతే"

"అలాగే వుండాలి లెద్దూ. డాంబికంగా వున్నవాడిలో అసలు సరుకే కనిపించదు. వట్టి పైనపటారం, లోనలొటారం వాళ్ళంతా. ఏమయినా సాదాగా పోయేవాడే మంచాడనుకో. నువ్వు సరిగ్గా చూడు, అబ్బాయి బి.ఏ చదివినవాడిలా కనిపిస్తున్నాడా! ఇందాక నాతో మాట్లాడినప్పుడు ఎంత వందనంగా మాట్లాడాడనుకున్నావ్! మన వాళ్ళల్లో ఎవరూ అలా మాట్లాడ్డం వినలేదనుకో. నీకూ నచ్చింది గనుక రెండురోజుల్లో అన్ని విషయాలూ సంప్రదించుకుని సంబంధం స్థిరపరచుకోవచ్చు. నచ్చి మనం యిస్తామనాలే గాని రెక్కలు కట్టుకొని వాళ్ళంతా యిక్కడవాలరూ. అందులోనూ శరభయ్యతో సంబంధం కలుపుకొందామని బోలెడుమంది ఎదురుచూస్తుంటే కావాలని వీరికిస్తామంటే కాదంటారాయేం? నువ్వు 'ఊ' అంటే రేపొచ్చే ఆదివారమే అటు పట్నంపోయే బదులు యిటు పల్లెకు వెళ్ళి ఏదో ఒకటి రైటనిపించేస్తాను. పోనీ పక్కవూరేగా! యిద్దరం కలిసే వెళ్దాం. ఇటు వెళ్ళేబస్సుకు బయలుదేరితే అటు వచ్చేబస్సుకు రావొచ్చు.ఏమంటావ్?"

శరభయ్య "సరే" అన్నాడు.

మళ్ళీ బస్సు దిగేంతవరకూ యిరువురూ మాట్లాడుకోలేదు. బస్సు ఆగాక అవతలి కుర్రాడు దిగివెళ్ళిపోయాడు. వెళ్ళిపోతున్న వాడిని పిలిచి "ఏం పేరన్నావు బాబూ" అంటూ అడిగాడు లక్ష్మయ్య.

"జనార్ధనరావండీ" అనిచెప్పి వెళ్ళిపోయాడు అతను.

ఇంటికి వెళ్ళాక సంబంధం సంగతి భార్య చెవిలో వేశాడు శరభయ్య.

"అదేమిటండీ!" అంది ఆమె విస్తుపోయి. ఆ వెంటనే మళ్ళీ "ఏడిచినట్టేవుంది మీ తెలివి. చూడగా చూడగా గుర్రం గాడిదయ్యిందట! ఉన్నకొద్దీ మీ తెలివి యిలా మండిపోతోందేం. నిక్షేపంలాంటి పిల్లను తీసుకెళ్ళి ఆ అడుక్కుతినేవాడికా యిచ్చేదీ? నలుగురూ వింటే నవ్వులాట తప్ప మరేమైనా వుందా! బంగారంలాంటి ఏ లక్షాధికారినో పెళ్ళాడవలసిన దానికిదేం ఖర్మమండీ. అసలు మీకు యీ బుద్ధెలాపుట్టిందంట? పోనీ డబ్బు లేదుగనకనా? యాభైవేల నగదు అలా మూలపడి మూలుగుతోంది కదా. ఇదంతా ఏం చేసుకుందామని– మిమ్మల్నీ నన్నూ కొప్పెట్టుకోడానికి తప్ప" అంది చిరుబురలాడుతూ.

"ఏడిశావ్ ఎర్రిదానా, నీ మాత్రం తెలివి నాకు లేదంటావా? ఏదో, పిల్లను

నువ్వే కన్నట్టూ, దాని భారమంతా నీకే చుట్టుకున్నట్టూ మాట్లాడుతావేం. అసలు సంగతి ఆలకించుమరి. ఇరవైవేలు కట్నంపోసి, మరో అయిదువేలు ఖర్చుచేసి దానికి పెళ్ళిచేయకపోతే ఏంపోయె? లేని కుటుంబంలోనుండి మంచివాడిని చూసి చేస్తే మాత్రం లోటేమిటొచ్చిందంట? అయిదారువేలతో అంతా తేలిపోతుంది. ఇంకా కావాలంటే పట్నంలో చిన్న పెంకుటిల్లొకటి కొనిచ్చేస్తే మళ్ళీ మనల్ని ఆశించకుండా ఆ వచ్చినజీతం రాళ్ళతో ఆలుమగలు గడుపుకోలేరూ? పోనీ మీ అన్ననడుగు ఏం చెప్తాడో. ఇందాక బస్సులో వస్తూ యిద్దరం కలసి ఆలోచించిందే యిది."

"ఏమో నాకేమీ అర్థంకావడంలేదు" అంటూ గొణిగింది ఆమె. శరభయ్య చిరునవ్వు నవ్వాడు "చూస్తావుగా" అంటూ.

ఆదివారం రాగానే బావామరుదులు యిద్దరూ చద్దన్నంతిని ఫస్టుబస్సుకు ప్రయాణం కట్టారు. బస్సు ఎక్కడమేమిటి రామాపురం చేరడమేమిటి అన్నీ అర్థగంటలో జరిగిపోయాయి. "ఇవ్వాళ ఏఊరు పండిందోగాని బస్సు మాబాగా వెళ్ళిందిబావా" అన్నాడు లక్ష్మయ్య.

"ఎవ్వూరో పండాలేమిటి, చూడు–మనం పెళ్ళిచూపులకు బయలుదేరేమంటే దేనికవే అన్నీ సమకూడిపోతున్నాయి. ప్రారంభంలోనే శుభసూచకం. అందులోనూ ఎరకమ్మ ఎదురురాక సామాన్యమా. వ్యవహారం యిట్టే ఫైసలా అయిపోతుంది."

ఇద్దరూ బస్సుదిగారు. కండువాల్ని సరిచేసుకుని ఊరిలోకి నడిచారు. అక్కడక్కడ వాకబుచేసి అయిదు నిమిషాలకు రాఘవయ్య యిల్లు కనుక్కున్నారు. ఇద్దరూ అక్కడకు చేరేసరికి కాబోయే పెళ్ళికొడుకు వీధిలోనే వున్నాడు. వీళ్ళను చూసి ఆశ్చర్యపోయి చాపవేసి కూర్చోబెట్టాడు.

"మీ నాన్న యింట్లో వున్నాడా బాబూ?" అన్నాడు లక్ష్మయ్య వ్యవహారానికి నాంది పలికి కూర్చుంటూ.

"ఇప్పుడే పొలానికి వెళ్ళారు. మీరు కూర్చోండి, పిలిపిస్తాను" అంటూ వీధిలో ఆడుకుంటున్న ఓ కుర్రాడ్ని పంపించాడు.

వాడు పరుగెత్తికెళ్ళి పొలంలో పనిచేస్తున్న రాఘవయ్యను వెంటబెట్టుకొచ్చాడు.

రాఘవయ్య వాకిట్లో కాలుపెడ్తూనే అరుగుమీద కూర్చున్న ఆ యిద్దర్నీచూసి ఆశ్చర్యపోయి "ఏమిటేమిటీ లక్ష్మయ్యగారా!" అంటూ వచ్చి వాళ్ళముందు చతికిల పడ్డాడు. ఆ తర్వాత తాపీగా "ఏదో దారితప్పి వచ్చినట్టున్నారే" అన్నాడు.

"అబ్బే అలాటి పొరపాట్లు జరగవండోయ్. మీతో పనుండబట్టే వచ్చాం" అన్నాడు లక్ష్మయ్య. అని, కొంచెంసేపు మాట్లాడకుండా ఊరుకున్నాడు. ఈ మధ్య సమయంలో అవతలివాడు ఆ పనేమిటో తనని అడగాలని.

అలానే అడిగాడు రాఘవయ్య – "నాతోనా!" అని ఆశ్చర్యపోతూ.

"ఆ. మీతోనే, వీరిని మీరు ఎరుగుదురనుకొంటాను-మా బావమర్ది శరభయ్యగారు" అన్నాడు లక్ష్మయ్య శరభయ్యను చూపిస్తూ. శరభయ్య చిన్న చిరునవ్వు నవ్వాడు ఆయన్ని చూస్తూ.

రాఘవయ్య తలూపాడు. "వీరిని ఎరక్కపోవటమేమిటి. ప్రత్యక్షంగా ఎప్పుడూ కలుసుకుని మాట్లాడకపోయినా చాలాసార్లు యిద్దరం ఒకేబస్సులో బస్తీకి వెళ్తుండేవాళ్ళం. స్వయంగా మీ అంతటివారు పనిగట్టుకుని వచ్చారంటే ఏదో పెద్ద విశేషమే వుండాలి"

లక్ష్మయ్య రంగంలోకి దిగేముందు చిన్నగా చిరునవ్వు నవ్వి "ఏంలేదూ, మా మేనకోడలు పెళ్ళీడుకొచ్చి నాలుగేళ్ళయ్యింది. ఇంతవరకూ పెద్దగా పెళ్ళిప్రయత్నాలేవీ చేయలేదు. అయినా అప్పుడప్పుడు ఏవో సంబంధాలు వస్తూనేవున్నాయి. ఇప్పుడప్పుడే పెళ్ళి ఎందుకులెద్దూ అంటూ వచ్చినవన్నీ తిప్పిపంపించేశాం. అదీగాక మా బావగారి అభిప్రాయం వేరు. మొదటినుంచీ వీరిది చాలా మెత్తని హృదయం. ఎవరన్నా బాధపడుతుంటే చూస్తూ వూరుకోలేరు. జాలిగుండె. అది అలా వుంచండి. అమ్మాయి పెళ్ళి విషయంలో వారొక నిర్ణయానికి వచ్చారు. డబ్బులేకపోయినా కాస్తా చదువుకున్న వాడిని చూసి, మంచివాడైతే ఏదో తోచినంత కట్నంయిచ్చి పెళ్ళి చేద్దామని వారి ఆశయం. అందుకే యీ నాలుగేళ్ళూ తగినవాడు దొరికినప్పుడే చెయ్యొచ్చులే అని ఊరుకున్నారు. కాని...."

కాస్సేపు ఆగి రాఘవయ్య ముఖంలోకి చూశాడు లక్ష్మయ్య. చాలా ఆతృతగా చూపుల్ని తనమీదే వుంచి చూస్తున్నాడు రాఘవయ్య. ఇక అట్టేసేపు అతన్ని బాధించడం యిష్టంలేక మళ్ళీ ప్రారంభించాడు.

"..... కాని , ఏమైనా ఏదో ఒక మంచి సంబంధం వెతికి యీ ఏడే పెళ్ళి చేసేద్దామనుకుంటుండగా మొన్న బస్తీకి వెళ్ళి బస్సులో వస్తోంటే మీవాడుకనిపించాడు. మీవాడని నాకేం తెలుసూ, వచ్చి పక్కన కూర్చుంటే వివరాలవీ అడిగాను. అప్పుడు తెలిసింది ఫలానా అని. అబ్బాయి బస్సు దిగి వెళ్ళిపోయాక బావగారు నాతో అన్నారు 'కుర్రాడు మన బుల్లికి తగ్గ జోడు కదుబావా' అని. మీ సంప్రదాయం, గౌరవమర్యాదలు

ఎరిగిన వాడిని గనుక బావగారితో అన్ని సంగతులు చెప్పి పెద్ద ఆర్భాటం లేకుండానే యిద్దరం కలిసి సంబంధం తేల్చుకుపోదామని వచ్చాం" అన్నాడు లక్ష్మయ్య.

రాఘవయ్య ఉబ్బితబ్బిబ్బయిపోయాడు. ఓమారు యింట్లోకి వెళ్ళి ఆడవాళ్ళందరికీ యీ సంగతిచెప్పి మళ్ళీ వచ్చి కూర్చున్నాడు-పిచ్చాపాటీ మాట్లాడ్డంతో పాటు కట్నకానుకల విషయాలు వివరంగా తెలుసుకుందామని.

ఇలా యిక్కడ రాఘవయ్య మాట్లాడుతుండగానే అతని బావమర్దికి కబురెప్పుడెళ్ళిందో పరుగెత్తుకొచ్చాడు వీరయ్య.

వీరయ్యను చూడగానే రాఘవయ్య గుండెల్లో రాయిపడింది. 'సమయానికి వీడెందుకొచ్చాడూ. తన కూతుర్ని కాదని డబ్బాశతో పై సంబంధానికి వప్పుకుంటున్నానని యిక్కడ ఏ మాత్రం అవాకులుచెవాకులు మాట్లాడినా వ్యవహారం యిట్టే మంట గలసిపోతుంది. ఈ వచ్చే అదృష్టం కూడా అంటకుండా పోతుంది' అనుకుంటూ ఆలోచించి ఏమయినా బావమర్దిని యిందులో తలదూర్చిస్తేగాని లాభంలేదనుకుని వీరయ్య ఆ యిద్దరికీ తన బావమర్దిని పరిచయం చేసి 'ఏదో,వ్యవహారం నువ్వే వొడ్డెక్కించెయ్యాలి బావా" అన్నాడు- అంతసేపూ జరిగిన సంభాషణను బావమర్దికి టూకీగా చెప్పి.

వీరయ్య కూడా వ్యవహారాల్లో మునిగితేలుతున్నవాడు. కోర్టుల దగ్గరనుండి కట్నాలవరకు రకరకాల వ్యవహారాల్ని నడిపి సిద్ధహస్తుడనిపించుకున్నవాడు.

బావమర్ది చేస్తున్న పనికి లోలోపల అగ్గిబుగ్గయిపోతున్నా పైకిమాత్రం నవ్వుతూనే 'ఓహో' 'ఆహా' అంటూ సంబంధం "సరే ఖాయం" అనిపించాడు.

"మరి మీలా మేం గొప్పలకు పోలేమండోయ్. అంతస్థుకు తగ్గ మర్యాద జరిపించగలమో లేమోనని భయపడుతున్నాం. పెళ్ళికి రెండుమూడువేలు ఖర్చుంటాయనుకుంటాను. ఇల్లొకటి- దూలాలు పుచ్చిపోయి పడిపోయేట్టు వున్నాయి. పెళ్ళేపెళ్ళి! అదికూడా బాగుచేయించాలి. అదీగాక యింటిమీద అప్పొకటి. అంతటికీ ...." నసిగాడు వీరయ్య.

"పోనీ మీరు అంతగా అడుగుతున్నారు గనక కట్నం అయిదువేలూకాక పెళ్ళిఖర్చులుకూడా భరిస్తాంలెండి. మునుపటిరోజులు కాదుకదా అయిదువేలూ చేతితో పట్టుకుని అయిదురోజులు పెళ్ళిచేయడానికి"

వీరయ్య తెల్లముఖం వేశాడు. 'ఇంటిగుట్టు బట్టబయలు చేస్తే వచ్చినవాళ్ళు •

వెనక్కు తిరుగుతారనుకుంటే యిదేమిటి?!'

శరభయ్య, లక్ష్మయ్య లేచి నుంచున్నారు. "వచ్చే సోమవారం మంచిదనుకుంటాను, తాంబూలాలు పుచ్చుకోవచ్చు" అన్నాడు శరభయ్య.

సరే అని బావమర్దులిద్దరూ తలూపి, కూడా బస్సువరకూవెళ్ళి వాళ్ళను బస్సెక్కించి వెనక్కు బయలుదేరారు. వస్తున్నప్పుడు దారిలో "నీ రుణం ఎలా తీర్చుకోగలను బావా. నువ్వు పూనుకోకపోతే యిది సొంతం అయ్యేదికాదు. మన అమ్మాయిని కాదని పై సంబంధం చేస్తున్నందుకు ఏమనుకుంటున్నావో ఏమో" అన్నాడు రాఘవయ్య వీరయ్య చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంటూ.

"అబ్బే, నేనేమనుకుంటాను, సిరి కలిసివస్తోంటే కాలదన్నడమెందుకు" అన్నాడు వీరయ్య బలవంతంగా నవ్వి.

ఇద్దరూ ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు.

నాలుగోనాడు పనిగట్టుకుని బావమర్ది యింటికివెళ్ళాడు వీరయ్య. వీరయ్య నట్టింట్లో కాలుపెట్టేసరికి చెల్లెలూ, బావమర్దీ పెళ్ళిగురించే మాట్లాడుకుంటూ కూర్చున్నారు.

"రా అన్నాయ్యా" అంది చెల్లెలు. వీరయ్య వెళ్ళికూర్చున్నాక "ఏమిటో. యీ సంబంధం నాకు యిష్టంలేదు. ఎంచక్కా నిక్షేపంలాంటి మేనరికం. అది వదులుకుని పైవాటికి పోవడమేమిటి? మీ బావకు డబ్బాశ తప్పితే మరేంలేదు. మంచో చెడో ఏమీ తెలుసుకోకుండానే 'ఊ' అనేస్తారు" అంది.

వీరయ్య కొంచెంసేపు ఆలోచిస్తున్నవాడిలా మౌనంగా కూర్చుని తలగోక్కుంటూ "కాని - బావా! అసలు సంగతి ఆలోచించావ్?" అన్నాడు. ఎదుటిముఖంలో ప్రశ్నార్థకాన్ని చూసి మళ్ళీ అతనే ప్రారంభించాడు- "పిల్లను మనం అడక్కుండానే కావాలని వచ్చి కోరి యిస్తున్నారంటే ఏమయివుంటుందంటావ్? పెళ్ళిఖర్చు కాణీకూడా మనం పెట్టుకోకుండా అంతా వాళ్ళే భరిస్తామనడంలో ఉద్దేశం ఏమిటో మరి! దానికితోడు అయిదువేలు కట్నం. ఏదీ మనం అడక్కుండానే అన్నీ వాళ్ళే చెప్పేస్తున్నారు. ఆఖరుకు యింటి మరమ్మత్తుకుకూడా ఏదో యిచ్చేట్టేవున్నారు. ఇదంతా దేనికంటావ్? ఈ సంగతి నువ్వసలు ఆలోచించివా? పిల్ల పెళ్ళీడు కొచ్చినా, ఆస్థిపాస్థులు బాగావుండికూడా, నాలుగేళ్ళు పెళ్ళికాకుండా వుండిపోయిందంటే... నిజం ఎలావున్నా అనుమానం మాత్రం పీడిస్తూవుంటుంది కదా. అదీకాక మరో విషయం. పెద్దపిల్లకు పెళ్ళి చేసిన ఆర్నెల్లకే

ముండమోసి యింట్లో కూర్చుందట. అసలు అంత డబ్బున్నందుకు ఏ లక్షాధికారితోనో వియ్యం కలపడం పోయి వెతుక్కుంటూ మన కాళ్ళదగ్గరికి రావడం ఏమిటి!? మనిషి ఎంత మంచివాడయితే మాత్రం ఉద్ధరింపన్న పేరుతో కన్నకూతుర్ని కాణీ ఆస్థిలేనివాడి చేతుల్లో పెడ్తాడంటావ్? ఏమో బావా! నాకేమీ పాలుపోకుండా వుంది. ఏం కంగారు 'పడ్డా ఏమొచ్చి పడుతుందోనన్న భయం'' వీరయ్య చెప్పడం ఆపి యిద్దరి ముఖాల్లోకీ చూశాడు.

ఇద్దరిముఖాల్లోనూ కత్తినాటు పెట్టినా నెత్తురుచుక్క కనిపించేట్టు లేదు.

''అవునన్నయ్యా! ఆమాటా నిజమే. నాకూ అదే సందేహం వచ్చింది. డబ్బు ఎరచూపి కళ్ళుముయ్యాలనుకున్నారు. ఇంకానయం, ముందే తెలుసుకున్నాం'' అంది రాఘవయ్య భార్య రవణమ్మ.

రాఘవయ్య కూడా ఓమారు బుర్రగోక్కున్నాడు. ''అవును బావా యిదేదో గోల్‌మాల్‌గానే వుంది''

ఆ మరుసటిరోజే అక్కడ శరభయ్య, లక్ష్మయ్యలు తాపీగా జానెడంత పొడుగు, బొటనవేలంత లావు లంకపొగాకు చుట్టల్ని కాల్చుకుంటూ పెళ్ళిచర్చ చేస్తుండగా ఊరూ పేరూలేని వాడెవడోవచ్చి ''రాఘవయ్య మీ సంబంధాన్ని చేసుకోనంటున్నాడయ్యా'' అంటూ చెప్పిపోయాడు.

ఆ తర్వాత పదీపదిహేను రోజులకు కాబోలు బావమర్దులిద్దరూ కూర్చుని వుండగా గాలికబురొకటి ఎవరో తీసుకొచ్చారు 'వీరయ్య కూతుర్ని రాఘవయ్య కొడుక్కి యిచ్చాడటయ్యా' అని.